
# స్నేహలత



యం. రాజేశ్వరి

'అమ్మా! ఈ ఫోటోలో వున్నది ఎవరమ్మా? ఎందుకమ్మా ఏడుస్తున్నావు?' అంటూ తల్లిని అడిగింది రెండేళ్ల సుశీల.

రాధ పాప పిలుపుతో ఈ లోకానికి వచ్చి కళ్ళు తుడుచుకుని పాపని చూసింది. అమ్మ తనని చూడటంతో పాప మళ్ళీ తన సందేహాన్ని వెలిబుచ్చింది.

'ఆ ఫోటోలో వున్నది అత్తయ్య, తల్లీ!'

'మరి అత్తయ్య ఎక్కడికి వెళ్ళారమ్మా.' అని అడిగింది పాప.

రాధ కళ్ళలో నీళ్ళు తిరిగింది. పాప ఎదుట పడకుండా అటు తిరిగి కళ్ళు తుడుచుకుని, 'అత్తయ్య దేవుడి దగ్గరికెళ్ళింది, పాపా!' అంది.

'మరి అత్తయ్య మనింటికి రాదామ్మా?'

'దేవుడి దగ్గరికెళ్ళిన వాళ్ళు మళ్ళీ రారమ్మా' అంటూ ఇంకో ప్రశ్న వేయనివ్వకుండా, 'వెళ్లి ఆడుకోమ్మా సుశీ' అంటూ పంపించింది. పాప ప్రశ్నలతో సుశీల జ్ఞాపకాలు చుట్టుముట్టగా సోఫాలో వాలిపోయి, గతాన్ని నెమరు వేసుకోసాగింది.

* * *

ఆరోజే చివరి పరీక్ష వ్రాసి ఇంటికి వచ్చిన సుశీల, తల్లి యిచ్చిన కాఫీ త్రాగి నడుం వాల్చింది. తన ఊహాసౌధంలో రాధ మెదుల్తోంది. 'రాధతోటి పరిచయం యిలా మారుతుందని ఎప్పుడూ తన కలలోనైనా ఊహించలేదు. ఏమిటీ ఋణబంధం? ఎన్ని జన్మల అనుబంధమో? ఎప్పుడూ తన ఎదుట రాధ ఉండాలి. రాధే తన సర్వస్వం. జీవితంలో తను అమితంగా ప్రేమించే వ్యక్తి రాధే. ఒకస్త్రీ తన సాటి స్త్రీపై ఇంతటి మమకారం పెంచుకోవటం ఆశ్చర్యమే. సాటి స్త్రీయే అగు రాధపై తనకు యెందు కింత ప్రేమ? ఈ ప్రశ్న తనకు తానే ప్రశ్నించుకుంటుంది. కాని జవాబు మాత్రం శూన్యం.

తనలో తాను తర్కించుకుంటూ సన్నగా కునుకు తీసింది సుశీల. సుందరమ్మ సుశీల గదికి, వచ్చి మగతగా నిద్రపోతున్న కూతుర్ని చూసి, 'ఏమిటో నమ్మా ఈ కాలపు చదువులు! రాత్రనక పగలనక చదివి చివరికి ఆరోగ్యం చెడుపుకుంటు న్నారు. ఆ ముఖం చూడు ఎలా వాడిపోయిందో' అంటూ ప్రేమగ సుశీల తల నిమిరింది.

ఆ స్పర్శకు సుశీల కళ్ళు తెరచి చిరునవ్వుతో తల్లిని చూసింది. 'ఏమిటమ్మా వేళాపాళా లేకుండా నిద్ర? గంట అప్పుడే అయిదున్నర కావస్తోంది. లేచి ముఖం కడుక్కో. టిఫిన్ చేశాను. తిందువుగాని లే.' అంటూ ప్రేమతో మందలించింది.

సుశీలకు చిన్నప్పుడే నాన్న పోయాడు. నాన్న లేడనే దిగులు లేకుండ సుందరమ్మ కూతుర్ని పెంచి పెద్ద చేసింది. సుశీల వాళ్ళ నాన్నకు పొలం పని. ఇప్పుడు వాళ్ళ పొలం అంతా సుశీల పెద్ద నాన్న రాఘవయ్య చూసుకుంటున్నారు. సుందరమ్మ ఒక్కగానొక్క కూతుర్ని మద్రాసుకు తీసుకెళ్లి కాలేజిలో చదివిస్తోంది. రాఘవయ్య ఒక్కగానొక్క కొడుకు మోహన్. విశాఖపట్నంలో మెడిసన్ చదువుతున్నాడు.

అద్దం ముందు నిల్చుని జడ అల్లుకుంటున్నది. అప్పుడు వివిధభారతిలో 'నీ చెలిమిలో నున్న నెత్తావి మాధురులు' అంటూ పాట వినవస్తోంది. సుశీల కళ్లనుండి ఆనందాశ్రువులు పడుతోన్నాయి. 'నిజంగా రాధతో వున్న తన చెలిమి తనకు ఇంకెవ్వరితోను లేదు. రాధతో స్నేహం వికసించిన పుష్పం లాంటిది. వికసించిన పుష్పం వాడి పోవచ్చు. కాని రాధతో స్నేహం ఎప్పుడూ వాడదు. అది నిత్య పరిమళ పుష్పం. రాధకు తప్ప మరెవ్వరికి స్థానం లేదు తన హృదయంలో.' గోడ గడియారం టంగు టంగు మంటూ ఆరుసార్లు కొట్టింది.

'అయ్యో! టైమయిందే' అనుకుంటూ తొందరగా ముస్తాబైంది సుశీల. 'అమ్మా! నేను అనురాధ ఇంటికి వెళ్లొస్తాను.' అంటూ గేటు ఆవరణ దాటింది. సుందరమ్మ వెనుకనే వస్తూ, 'ఏమిటమ్మా ఈ విడ్డూరం? రోజుకొకసారి రాధను చూడకుండ ఉండలేవు' అంటూ గేటు వేసి తన పనిలో నిమగ్నురాలైంది.

* * *

రాధకు నాన్న ఉన్నారు. రాధ ధనవంతుల ఇంట పుట్టింది. సుశీలతో పాటు కాలేజిలో చదువుతోంది. 'రాధా! రాధా!' అంటూ మెట్లు ఎక్కుతున్న సుశీల రాకను గమనించి రాధ పని మనిషితో 'జాగ్రత్త' అన్నట్లు కనుసన్న చేసి పడకపై ముసుగు తన్ని పడుకుంది.

'రాధా! రాధా!' అంటూ ఇల్లంతా గాలిస్తూ చివరికి ముసుగు తన్ని పడుకున్న రాధను చూసి నిలువెల్లా నీరైపోయింది. ప్రక్కనున్న పనిమనిషితో 'ఏమిటే రాధకు? ఈ వేళప్పుడు ఎందు కలా పడుకుంది? నాన్న గారెక్కడ? ఏం, నేనడిగిన దానికి జవాబు చెప్పక అలా ఉన్నావేమిటి?' అని కంగారుగా మాట్లాడుతుంది.

'ఏం చెప్పనమ్మా? నిన్న సాయంకాలం వాళ్ల నాన్నగారు పని మీద ఊరి కెళ్లారు. రాత్రి కూడ

సరిగా ఫోం చేయలేదు. తెల్లవారి నుండి యిలాగే పడుకుని ఉన్నారు.' అని చెప్పడం ముగించిందో లేదో, 'అలా అయితే ఇంత దాకా డాక్టరు నెందుకు పిలువలేదు నాకు ఎందుకు తెలుపలేదు? మొద్దు ముఖమా' అని మెత్తగా చీవాట్లు పెట్టింది

ఫోను తీసి డాక్టరుగారికి డయల్ చేసింది 'హలో, డాక్టరు గారేనా? నమస్కారమండీ. నేను సుశీల మాట్లాడుతున్నాను. రాధకు...' 'సుశీ నాకేం లేదు. ఎందుకింత కంగారు?' అంటూ ఫోను లాగేయబోయింది.

'ఉ! కాస్సేపు ఊరుకో తల్లీ' అంటూ ఫోను చెవి దగ్గర పెట్టుకునే రాధను మందలించింది

డాక్టరుగారు కంగారుగా, 'ఏమిటమ్మా?' అన్నారు.

'ఓ. సారీ డాక్టర్! మిమ్మల్ని కాదు. ఇక్కడ ఈ అల్లరిపిల్ల మీకు ఫోను చెయ్యవద్దంటేను మందలించేను. మరేంలేదు. క్షమించండి'

'ఫరవాలేదు లేమ్మా.'

'రాధకు ఒంట్లో బాగుగా లేదు మీరు ఒక్కసారి వెంటనే రావాలి. వాళ్ల నాన్నగారు కూడ ఊర్లోలేరు. త్వరగా వస్తారుగా మరి? ఉంటానండి.' అంటూ ఫోను పెట్టేసింది.

రాధ విచారంతో సుశీ దగ్గరికి వెళ్ళి, 'ఏమిటి సుశీ నువ్వు చేసింది?'

'ఊ. నేను చేసింది తప్పు. మరి తమరు చేసింది మహా కరెక్టు కాబోలు.'

'అవును. నేను చేసిన తప్పేమిటి?'

'తప్పేమిటా? ఒంట్లో బాగులేదని నాకు ఉదయమే తెలుపకపోవటం ఒక తప్పు. ఉదయం నుండి డాక్టరికి కబురంపకుండుట రెండవ తప్పు.

రాధ పక్కున నవ్వుతూ, 'అయితే మా సుశీ పప్పులో కాలువేసిందన్నమాట!'

'పప్పులో కాలు వేయటమా! ఏమిటి రాధ? నువ్వు మాట్లాడేది?'

'సుశీ! నేడు ఏప్రిల్ ఫస్ట్ అన్న సంగతి మరి చావా? ఉదయం నుండి నీరాకకై ఎదురు చూచి చూచి నా కండ్లు కాయలైపోయాయనుకో. నిన్ను ఫూల్ చెయ్యాలని ఇంత నాటక మాడాను. కడకు నేను కూడ నీతో పాటు ఫూల్ నయ్యాను అనవసరంగా డాక్టరుకు ఫోన్ చేసి ఆయనకు శ్రమ ఇస్తున్నాము'

సుశీలకు ఏం మాట్లాడాలో తోచక అలాగే రాధని చూస్తూ నిలబడిపోయింది. బయట కారు హారన్ వినిపించటంతో సుశీల ఈ లోకానికి వచ్చింది.

ఇంతలో డాక్టరు పైకి వచ్చి నిక్షేపంగా వున్న రాధని చూస్తూ గుమ్మం దగ్గరే నిలబడిపోయారు. రాధ డాక్టరు దగ్గరి కెళ్ళి 'మమ్మల్ని క్షమించావనండి. డాక్టర్! ఆ తరువాత విషయమంతా చెబుతాము.' అని అడిగింది

'ఎందుకమ్మా క్షమించడం?' రాధ విషయమంతా క్లుప్తంగా వివరించింది డాక్టరు చిరునవ్వుతో సుశీల దగ్గరికి వచ్చి, తల నిమురుతూ, 'ఎంత పిచ్చి తల్లివమ్మా! రాధ చూడు నిన్ను ఎంత కంగారు చేసిందో?' అన్నారు

రాధ సుశీల దగ్గరికి వచ్చి 'నా మీద వున్న ప్రేమ కొద్దీ తను ఆవిధంగా చేసింది, డాక్టర్. ఇందులో తప్పంతా నాది తనదేమి లేదు. నామీద తన కెందుకో అంత ప్రేమ? మధ్య మిమ్మల్ని శ్రమ పెట్టాము. ఎప్పుడూ తనింతే డాక్టరు. నామీద తనకున్న ప్రేమ, అనురాగం అన్నీ తెలిసి కూడ నేను ఈ విధంగా చేసానంటే నన్ను నేను నిందించుకోవాలి' సుశీలకి తన మీద వున్న అమితమైన ప్రేమను గుర్తించిన రాధ కళ్లలో నీళ్లు తిరిగాయి.

'ఎందుకా కన్నీరు? రాధా! ఇప్పుడు నువ్వు చేసిన తప్పేమిటి? నా తోటి చనువు కొద్దీ నువ్వు నాటకం ఆడావు. నిజం తెలీకుండా నేను కంగారు పడ్డాను' అంటూ సుశీ కళ్ళు తుడిచింది

డాక్టరు గారు, రాధ నాన్నగార్కి మిత్రులు. రాధ సుశీల స్నేహాన్ని బాగా ఎరిగిన వ్యక్తి. ఇద్దరినీ దగ్గరికి తీసుకుంటూ 'అమ్మా! మీ స్నేహం అపూర్వమైనది ఇలాగే కలకాలం వర్ధిల్లండి' అంటూ ఆశీర్వదించారు.

మా గొడవలో పడి అతిథి సత్కారం కూడా మరిచాము కూర్చోండి డాక్టరుగారూ!' అంటూ రాధ లోపలి కెళ్ళింది 'మీరిద్దరూ కలిశారంటే కబుర్లలో పడి ఎదుటి వ్యక్తినే కాదు ప్రపంచాన్నే మరచిపోతారు అంటూ నవ్వుతూ సోఫాలో కూచున్నారు. రాధ ట్రేలో కాఫీ తీసుకొచ్చింది. కాఫీలు పూర్తి కాగానే డాక్టరు వేరే పనుందంటూ సెలవు పుచ్చుకున్నారు.

'సుశీ! ఒక్కసారి క్షమించానను అప్పుడే నా మనస్సుకు తృప్తిగా వుంటుంది.'

'ఎందుకో క్షమాపణ?'

'నిన్ను కంగారు పెట్టినందుకు'

'ఉహూ! నా కొక ప్రామిస్ చేయాలి'

'ప్రామిసా! అంటూ ఆశ్చర్యంగా రాధ సుశీలను చూసింది.

'అవును. చేసావంటేనే నేను క్షమించేది'

'నీకు చేసిన ప్రామిస్‌ను నిలబెట్టుకోగలిగినంతటి అర్హత వుందా' అంటావు కదూ?

'అవును.' అంటూ రాధ కళ్ళు దించుకుంది.

'తప్పకుండా వుంది' అంటూ సుశీల రాధను సమీపించింది. రాధ చుబుకం పట్టుకుని ముఖం పైకెత్తి, 'అదే అదే నేను కోరేది. నా ఎదుట నువ్వెప్పుడూ కళ్ళ నీళ్ళు పెట్టుకోకూడదు. ఎప్పుడూ సంతోషంగా నవ్వుతూ వుండాలి. ఇదే నా జీవితంలో నేను కోరేది, భగవంతుని ప్రార్థించేది' అంటూ రాధను కౌగలించుకున్నది. ప్రణయజీవులవలె ఒకరికళ్ళలో ఒకరు తమ నీడను చూచుకుంటూ తృప్తిగా చిరునవ్వులు చిందించుకున్నారు.

* * *

పోస్టుమేన్ వాకిట్లో నిలబడి 'అమ్మా! టెలిగ్రామ్' అని కేక వేయడంతో సుశీల పరుగున వచ్చి టెలిగ్రాం అందుకుంది సుందరమ్మ కంగారుగా, 'ఏమిటమ్మా విషయం? ఎవరిచ్చారమ్మా టెలిగ్రాం?' అంటూ ఆదుర్దాగా ప్రశ్నించింది.

'అమ్మా! మోహన్ అన్నయ్య ఈరోజు సాయంకాలం ట్రైనుకు వస్తున్నారమ్మా నేను స్టేషను కెళ్ళాలి'

'అబ్బ! ఎన్నాళ్ళకు వస్తున్నాడమ్మా, మోహన్ బాబు! ఏమిటో తండ్రి దగ్గర లేకుండా చదువుతూ, హోటల్ మెతుకులు తింటూ ఎంత కష్టపడుతున్నాడో!'

'అమ్మా! నేను రాధ ఇంటికి వెళ్తొస్తాను. అన్నయ్య వస్తున్న విషయం చెప్పి త్వరగా వచ్చేస్తాను. సాయంకాలం వెళ్లటానికి తీరిక వుండదు.' అంటూ రాధ ఇంటికి దారి తీసింది సుశీల.

'రాధా! గుడ్ న్యూస్. మోహన్ అన్నయ్య వస్తున్నాడు. నువ్వు ఎప్పుడూ చూడలేదు కదూ? చాలా సరదా మనిషి. నేనంటే తన కెంతో అభిమానం. విశాఖలో మెడిసన్ చదువుతున్నాడని కూడా నీతో చెప్పానుగా!' అంటూ ఊపిరి సలుపుకోకుండా మాట్లాడేస్తోంది.

'అను తల్లీ! మీ అన్నయ్య దండకం. ఇకనేం? మీ అన్నయ్య వస్తున్నారు కదూ! నేను జ్ఞాపకం ఉంటానేమిటి?' నిష్ఠూరంగా మాట్లాడింది రాధ.

రాధ చేతిని అందుకుని, 'ఏం రాధా! అలా మాట్లాడుతావు అన్నయ్య వచ్చినా లేక సరాసరి ఆ దేవుడు దిగివచ్చినా...నిజం రాధా నిన్ను మాత్రం చూడకుండా వుండలేను' అంటున్న సుశీల ముఖం దీనంగా తయారైంది.

'సుశీ! ఛ ఏమిటిది? నేనేదో తమాషాగా మాటాడాను. అబ్బబ్బ! నీతో వచ్చిన పెద్ద చిక్కు ఇదే. ప్రతి చిన్న విషయాన్ని ఇలా సీరియస్‌గా తీసుకుంటావు రేపు వారెవరో గాని శ్రీవారు నీతో ఎలా కాపురం చేస్తారో ఏమో?' అంటూ సుశీల బుగ్గ మీద చిటికె వేస్తూ నవ్వింది.

* * *

స్టేషనులో మోహన్‌ని చూస్తూనే 'అన్నయ్యా' అంటూ సమీపించింది 'అబ్బ! ఇన్నాళ్ళకు నేను గుర్తు కొచ్చాను కదూ? థ్యాంక్ గాడ్! ఈ జ్ఞాపకం వదిన రాకముందే వచ్చింది.'

మోహన్ చిలిపిగా, 'ఉహూ! అలాగా! అయితే నిన్ను చూసేశాను కదూ? తరువాత రైలు వచ్చే దాకా ఇక్కడే వెయిట్‌చేసి వెళి పోతాను. అమ్మతో నీవు వెళ్ళి చెప్పు ఏం?' అని అడిగాడు.

సుశీల కళ్ళలో చిరుకోపం తొంగి చూసింది. తను మౌనంగా వుండటం చూసి, ఇకనేం మౌనం అర్ధ అంగీకారం' అంటూ వెయిటింగ్ రూం వైపు దారితీశాడు. 'చాలు ఇక ఏడిపించటం. బయట టాక్సీ కాచుకుని వుంది.' పద అన్నయ్యా' అంటూ ఇంటికి దారితీసింది.

టాక్సీ దిగుతోన్న మోహన్‌ను సమీపించిన సుందరమ్మ 'ఏమిటీ బాబూ? ఇలా చిక్కిపోయావు?' అంటూ ఆహ్వానించింది

'చిక్కిపోయానా! లేదు పిన్నీ. ఏం సుశీ! నువ్వే చెప్పు నేను చిక్కిపోయానంటావా?'

'ఏమిటో బాబూ, నే నేమీ చెప్పలేను. అమ్మా ఆకలేస్తుంది త్వరగా వడ్డించమ్మా' అంటూ తన గదిలోకి వెళ్ళింది.

'అన్నయ్యా! పరీక్షలెలా వ్రాశావు?' అంటూ ప్రశ్నించింది సుశీల అన్నం కలుపుకుంటూ.

'బాగానే వ్రాశాను.
మరి తమరి సంగతేమిటి?'

'ఫరవాలేదు ప్యాసవుతాననే నమ్మకం వుంది.'

'సుశీ! పరీక్షలైపోయాయిగా ఇక టైమ్ ఎలా గడుస్తుంది?'

'ఆ టైంకేమి నాయనా సుశీకి' ఇంకా ఆ టైం సరిపోవటంలేదంటే నమ్ము. ఎప్పుడూ రాధతోటే సరిపోతుంది ఆ అమ్మాయిని చూడకుండా క్షణం సేపు వుండలేదు. నువ్వు వస్తున్న విషయం కూడా అప్పుడే వెళ్ళి తనకు చెప్పివచ్చింది ఏ విషయమైనా రాధతో మొదట చెప్పాలి. తరువాతే నా సంగతి కూడాను.'

'వాట్ సుశీ! ఈసిట్ ఎ గరల్ ఫ్రెండ్ ఆర్ ఎ బాయి ఫ్రెండ్' అంటూ వేళాకోళంగా అడిగాడు.

సుశీల నవ్వుతూ 'షి ఈస్ సిమిలర్ టు బాయ్ ఫ్రెండ్' అంటూ భోజనం ముగించి లేచింది.

* * *

పల్లెనిగాలి వీస్తూంది. రోడ్డు నిర్మానుష్యంగా వుంది. మోహన్ పరధ్యానంగా సైకిల్ తొక్కుతున్నాడు. ఒక సీలిరంగు కారొకటి ఎదురుగా వస్తూంది. పరధ్యానంగా వున్న మోహన్ సైకిల్ కారును ఢీకొనడంతో ఉలిక్కిపడ్డాడు.

కారు డోరు తెరచుకుని 'ఓ సుందరి 'క్షమించండి ఏదో పరధ్యానంగా డ్రైవ్ చేస్తుంటేనూ...'

'అబ్బె మీ తప్పేమీ లేదండి నేనే పరధ్యానంగా సైకిల్ తొక్కుతుంటే యిలా జరిగింది.

రాధ ఆ విశాల హృదయాన్ని, చిలిపి కళ్ళను చూస్తూ అలాగే నిలబడిపోయింది. దివి నుండి భువికి దిగివచ్చిన దేవతలా వున్న రాధను తిలకిస్తూ నిలబడ్డాడు మోహన్. వెనుక వస్తున్న కారు హారన్ విన్పించడంతో ఉలిక్కిపడ్డ రాధ వెళ్ళొ

# స్నేహలత

స్తానండి, నమస్తే అంది. మోహన్ కూడా ప్రతినమస్కారం చేసి వెళ్ళిపోయాడు.

* * *

'రాణిగారి రాక ఇంటినుండేనా?' సుశీల ప్రశ్నించింది.

'అవునండీ రాజాగారూ.' అంటూ ఇద్దరూ నవ్వుకుంటూ మేడ మీదికి వెళ్ళారు.

'సుశీ! నేను ఇంటి నుండి బయలుదేరి వస్తుంటే దారిలో ఒక ఆక్సిడెంట్ జరిగింది.'

'అవును మరి. మా రాధారాణిగారు డ్రైవ్ చేస్తుంటే రోడ్డు మీద ఎవరూ సంచరించకూడదు. మరే వాహనాలు అడ్డు రాకూడదు. ఇంతకీ ఆ రూల్ తెలియక అవస్థ పడిన అభాగ్యుడెవరో పాపం?' అంటూ ఎగతాళి చేయసాగింది.

రాధ బుంగమూతి పెట్టి సుశీల వైపు కోపంగా చూసింది. 'ఆ! అదే! కోరిన చిన్నదాని కోర చూపే అందము' అంటూ సుశీ రాగయుక్తంగా పాడటం చూసి రాధ పక్కున నవ్వింది.

'ఇప్పుడు చెప్పు. అసలేం జరిగిందో?' రాధ జరిగిన సంగతి వివరించింది.

'పాపం గాయాలు తగిలాయా?' 'గాయాలు ఏమీ లేవులే.' అని రాధ అంటూండగా కాలింగ్ బెల్ మ్రోగింది. సుశీల క్రిందికి వెళ్ళింది.

'ఏమిటన్నయ్యా! ఇప్పుడేగా అలా వెళ్ళొస్తానంటూ వెళ్ళావు?

'అవును సుశీ! ఏదో చికాకుగా వుంటేను ముందుకు వెళ్ళలేక వెనక్కి వచ్చేశాను. ఒకకప్పు కాఫీ పట్రావమ్మా'

'అన్నయ్యా! నేను చెప్పానుకదూ! నా ఫ్రెండ్ రాధను గురించి. తనుకూడ మేడ మీదుంది. నీకూ తనకూ కాఫీ తెస్తాను. నువ్వు పైకి వెళ్ళు.'

మోహన్ దీర్ఘంగా నిట్టూరుస్తూ, 'ఇంట్లో వున్నంతసేపు రాధా రాధా అంటూ వుంటావు. ఇకే సరాసరి ఆ అమ్మాయి వచ్చిందంటున్నావు. ఇక తమరికి నా మీద అక్కర ఎందుకుంటుందీ' అంటూ నన్నగా ఈల వేస్తూ మెట్లెక్కుతున్నాడు.

పైకి వెళ్ళగానే సోఫాలో కూర్చుని పత్రిక తిరగేస్తున్న రాధను చూస్తూనే నిలబడిపోయాడు తను చూస్తున్నది కలకాదుకదా! కారులో కనబడిన ఆమెను మరోసారి చూడ్డం పడుతుందా అని అనుకుంటుంటే వెంటనే ఇక్కడ కనబడింది. రాధ మోహన్‌నిచూసి లేచి నిలబడింది. ''మీరు. . . .ఇక్కడ. . ఎలా''

ఆమె ప్రశ్నవిన్న మోహన్ చిలిపిగా ''మీరు... ఇక్కడ. . . .ఎలా. . . ?'' అంటూ ఆమెను అనుకరించాడు. రాధ తలవంచుకుని నవ్వుకుంది అతని చిలిపితనానికి. సుశీ అన్నయ్య ఇతడే కాబోలు అనుకుని, తలెత్తి అతని కళ్ళలోకి చూడసాగింది

'ఎక్కడయినా గాయాలు తగిలాయాండీ?'

'అవునండీ! పెద్దగాయమే తగిలింది.'

'నిజంగానా! ఎక్కడండి?' ఆమె ప్రశ్నించింది ఆదుర్దాగా.

'నిజమే! ఇక్కడేనండి' అంటూ ఆమె చేతులను తన హృదయంపై వుంచుకున్నాడు. ఆ స్పర్శతో రాధ మేను పులకరించింది.

'మరి డాక్టరు దగ్గరకు వెళ్ళలేక పోయారా?'

'ఇక్కడే వున్నారుగా డాక్టరు.'

'ఎవరో'

'ఊహూ! ఎంత అమాయకంగా అడుగుతావు? ఆ డాక్టరు ఈ రాధే.'

కాఫీ కప్పులతో ప్రవేశించిన సుశీల వారి పరిస్థితిని అర్థం చేసుకుంది. గొంతు సవరించుకుని, 'ఇక కాస్త భువికి దిగివచ్చి, కాఫీ పుచ్చుకోండి. పిలీ వెళ్ళరుగాని మీ లోకానికి.' అంటూ హాస్యం చేసింది

మోహన్ ఆక్సిడెంటు సంగతి చెప్పాడు. రాధ సిగ్గుతో తలవంచుకుంది. 'అన్నయ్యా! నిన్ను ఢీకొన్న రాధకు మంచి శిక్ష వెయ్యాలి. కాకపోతే అంత పరధ్యానమేమిటి?' అంటూ క్రిందికి వెళ్ళిపోయింది.

'విన్నావా? రాధా! నిన్ను గట్టిగా శిక్షించదలచాను.

'ఏమిటో ఆ శిక్ష?'

'నిన్ను నా మనఃపంజరంలో బంధించేస్తాను.'

* * *

సుశీల, రాధల మధ్య మోహన్‌కు కాలం గడటమే తెలీలేదు. సెలవు అప్పుడే పూర్తి కావస్తోంది. మరుసటిరోజు తన ప్రయాణాన్ని రాధకు చెప్పటానికి వెళ్ళాడు మోహన్.


రాధ మోహన్ గురించి ఆలోచిస్తూ కూర్చుంది. తన కళ్ళను ఎవరో మూయటంతో ఉలిక్కిపడి 'అబ్బ! ఎవరది?'

'ఎవరో చెప్పుకో చూద్దాం? అప్పుడే చేతులు తీసేది.'

మోహన్‌ని గుర్తించిన రాధ 'నాకు తెలుసునండీ అబ్బాయిగారెవరో, ఏ వూరో, ఏ పేరో.'

'ఆహా! అలాగాండీ అమ్మాయిగారూ! అయితే మేమెవరమో చెప్పండి చూద్దాం?'

'ఊ! చెప్పనా? మీరు . . . ఆ గోకులంలో



రాధను అల్లరి చేసిన మహానుభావులు. ఇప్పుడు ఈ ఇంట్లో అల్లరి చేస్తున్నారు.

'అలాగా! అయితే నేను ఆమెని అల్లరి చేస్తున్నంత సేపు ఆమెగారు నన్నేమీ అల్లరి పెట్టలేదన్న మాట!'

'లేదుగా!'

'అయ్యో పాపం! విరహబాధలో ఆ గోపాలుడు బాధపడుతుంటే రాధాదేవిగారు ముసిముసి నవ్వులు నవ్వుతూ ఊరుకున్నారుగా?'

'ఊహు, అదేనండి అబ్బాయిగారూ. ఈ రాధ వేసే అల్లరి! మీ చదువు పూర్తి చేసేంతవరకూ, పెళ్లి అక్షింతలు వేసేవరకు ఈ అల్లరి. నిజం మోహన్. మీరు నా మీద ప్రేమతో చదువుని అశ్రద్ధ చేస్తారేమోనని భయంగా వుంది.'

'పిచ్చి రాధ! నేను తప్పక కష్టపడి చదివి కాస్త చెప్పుకుంటాను లెక్చర్లు మరిచాను. రేపే నా ప్రయాణం. ఆ విషయం చెప్పటానికే వచ్చాను.'

'నిజంగానా?' అని అంటూనే రాధ కళ్ల నిండా నీళ్లు నిండాయి

'ఛ. ఎందుకు రాధా ఆ కన్నీరు? ఇప్పుడేగా ప్రశస్తంగా చదువుకుంటూ హితోపదేశం చేశావు ఆడవారి మనసు సున్నితమని విన్నాను. కాని మా రాధాదేవి గారి మనస్సు అతి సున్నితమని నాకిప్పుడే తెలిసింది.'

'లేదండీ! మీరు వెళ్తుంటే కష్టంగా వుంది. అలాగని మరేంలేదు. అయినా ఇక సంవత్సరమేగా! మిమ్మల్ని తలచుకుంటూ ఈ ఒక్క సంవత్సరం ఎలాగో గడిపేస్తాను. మళ్లీ మీరు నావారవుతారుగా.' అంటూ అతని హృదయంపై వాలిపోయింది

మోహన్ ఆమె కురులను నిమురుతూ, 'ఏదీ రాధా ఒక్కసారి చిరునవ్వు నవ్వాలి.' అంటూ ముఖం ... రాధ ... నవ్వింది. 'తప్పక పత్రాలు వ్రాస్తుండాలి.' అనుకుంటూ ఇద్దరూ విడిపోయారు.

మరునాటి రోజు మోహన్‌ను సాగనంపటానికి సుశీల, రాధ స్టేషనుకు వెళ్లారు. రైలు కదిలి వెళ్లిపోతుంటే ఇక దుఃఖం ఆపుకోలేక సుశీలపై వాలి పోయింది రాధ.

*　　*　　*

కన్నుమూసి తెరిచేటప్పటికి సంవత్సరకాలం క్షణంలో ముగిసింది. సుశీల ఉత్తరంతో రాధామోహన్‌ల ప్రణయ గాథ తెలిసింది. పెద్దనాన్నను ఒప్పించిరమ్మంటూ తల్లిని ఊరికి పంపింది. తను ఆరోజు రాధతో గడపటానికి నిశ్చయించి, వాళ్లింటికెళ్లింది. స్నేహితు రాళ్లిద్దరూ కబురు చెప్పుకుంటూ ఒకే మంచంమీద పడుకున్నారు. నిద్రాదేవి తన చల్లని చేతులతో వాళ్లిద్దరినీ జోకొట్టింది.

ఎత్తైన కొండలు, గుబురుగా పొదరిండ్లు, పెద్దవి, ఎత్తైన చెట్లు, నిశ్శబ్దమైన వాతావరణం. ఎక్కడ చూచినా కటిక చీకటే. చందమామకూడా ఆ ప్రదేశాన్ని చూడటానికి అసహ్యించుకుని కాబోలు కనిపించటం లేదు. అలాంటి భయంకర వాతావరణంలో వుండటానికి ఇష్టపడకనో ఏమో మోహన్, రాధ ఇద్దరూ వడివడిగా ఎత్తైన కొండలను దాటి వెళ్లిపోతున్నారు. సుశీ వాళ్లను అనుసరించలేక








ప్రఖ్యాత కెమిస్టులు & డ్రగ్గిస్టు లందరివద్ద లభించును.
Advt. Permitted under G.O. MS. No. 1121

'డాక్టరుగారూ! రాధమ్మగారు అమ్మాయిని ప్రసవించారు.' 'మోహన్! ఈ విషయం రాధకు ఇప్పుడే తెలుపకు. ఆమె ఈ దెబ్బకు తట్టుకోలేదు. మళ్లీ ప్రాణాపాయం కలగవచ్చు. జాగ్రత్త' అంటూ హెచ్చరించి రాధవున్న గదివైపుకి దారితీశారు.

రాధ మెల్లగా కళ్లుతెరచి చుట్టూ చూసింది 'పాప ఏదీ' అంటూ మెల్లగా అడిగింది. నర్సు పాపను రాధ ప్రక్కన పడుకోబెట్టింది. 'సుశీమాటే నిజమైంది డాక్టర్! సుశీల ఏదీ? పిలవండి చూడాలని వుంది'

'అమ్మా! ఇప్పుడు చూడటానికి వీల్లేదు. బలహీనంగా వున్నావు. ఎక్కువగా మాట్లాడకూడదు విశ్రాంతి తీసుకోవమ్మా' అంటూ తలవంచుకుని వెళ్ళిపోయారు.

మోహన్ గదిలోనికి అడుగుపెట్టగానే రాధ మళ్ళీ అడిగింది.

'సుశీల ఏది?'

'సుశీ వాళ్ల పెదనాన్నగారిని చూడటానికి వూరి కెళ్లింది' అంటూ ఏదో చెప్పి బయటికి వెళ్లిపోయాడు.

మోహన్ మాటలు అసహజంగా తోచాయి రాధకు. సుశీ తనని విడిచి ఎప్పుడూ వెళ్లదు. పాపని ఎప్పుడు చూద్దామాని ఎంత తహతహలాడింది తనే పాపిష్టిది. సుశీని విడిచి మోహన్‌తో వెళ్లిపోతే దిగులుతో ఎంత చిక్కిపోయింది. మోహన్ తననుండి ఏదో దాస్తున్నట్లు తోచింది రాధకు.

* * *

ఇంటికి వచ్చిన తరువాతగాని తనకు తెలియదు తన సుశీ ఇక తనకులేదన్న విషయం. ఆ విషయం విన్న వెంటనే మూర్ఛపోయింది. రెండు రోజులు అన్నం మానేసింది. కాని మనిషి గాయాన్ని మాన్పించేశక్తి ఒక్క కాలానికే వుంది. కాల ప్రవాహంలో ఎంతటి బాధైనా తగ్గిపోతుంటూంది. గాయం మానినా మచ్చమాయదు కదా! అలాగే రాధ మనస్సులో సుశీల ఓ దేవతామూర్తి రూపంలో నిలిచిపోయింది

* * *

'రాధా! రాధా!' అన్న పిలుపుతో ఉలిక్కిపడి కళ్లు తెరచి చూసింది రాధ. మోహన్ ఎదురుగా నిలబడి పిలుస్తున్నాడు.

'ఏమిటలా పడుకున్నావు? దీపమైనా వేసుకోకుండా. వేళకానివేళ ఏమిటానిద్ర?' అంటూ స్విచ్ నొక్కిన మోహన్ రాధముఖం చూసి ఆగిపోయాడు. బుగ్గలన్నీ కన్నీటితో తడిసివున్నాయి.

'ఏం జరిగింది రాధా?' అంటూ రాధని సమీపించి కూర్చున్నాడు.

'అబ్బే! ఏమీ లేదండీ. సుశీ జ్ఞాపకం వస్తేనూ ……' అంటూ ఆగింది.

మోహన్‌కూడా క్షణంసేపు కళ్లు మూసుకుని సుశీలకి అంజలి ఘటిస్తున్నట్లు వుండిపోయాడు కాని తాను బాధపడితే రాధ మరింత ఎక్కువగా బాధ పడుతుందని గ్రహించి, 'లే రాధా! లేచి టాయిలెట్ అవు, అలా వెళ్లొద్దాం. సుశీల ఎక్కడికీ వెళ్లలేదు. మన పాపగా మళ్లీ మన ఇంటనే జ్యోతిని వెలిగించింది' అన్నాడు. అవునంటూ గోడగడియారం టంగుమని మ్రోగి ఆమోదించింది.




రాబర్ట్ కెనెడీని హత్యచేసిన సిర్హాన్ అనే అతని మనస్తత్వాన్ని పరిశీలించడానికి అమెరికా ఆహ్వానం మీద మన దేశంలో ప్రఖ్యాత 'పేరా సైకాలజిస్ట్' ప్రొఫెసరు హెచ్. యన్. బెనర్జీ లాస్‌ఏంజిలిస్‌కు వెళ్ళి పోయిన ఆగష్టులో తిరిగి వచ్చారన్న వార్త విన్న యావత్ భారత దేశమూ మనదేశంలోనూ అంతటి మేధావు లున్నారని ఆనందించింది.

అసలు విషయం ఆనక బయటపడింది.

తనని లాస్ ఏంజిలిస్ పోలీసుశాఖ సిర్హాన్‌ని పరీక్షించేందుకు వెంటనే రమ్మందని భారత ప్రభుత్వానికి వచ్చుచెప్పి బెనర్జీ అమెరికా వెళ్ళి వచ్చారు. ఈ విషయంమీద ఆయన పని చేస్తున్న రాజస్థాన్ విశ్వవిద్యాలయం ఫిలాసఫీ శాఖ ఉన్నతాధికారి లాస్ ఏంజలిస్ పోలీసుశాఖకు రాశారుట. తాము బెనర్జీని రమ్మని కోరలేదనీ టెలిగ్రాములు ద్వారా తనకి సిర్హాన్‌ని పరీక్ష చేసే అవకాశం యివ్వమని ఆయన కోరితే ఆ సందర్భంలో సిర్హాన్ న్యాయవాదిని సంప్రదించమని రాశామని లాస్ ఏంజలిస్ పోలీసు శాఖ రాసిందట. ఈ విషయాన్ని ఆ ప్రొఫెసరు తన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌కు తెలియజేశారట. కానీ ఏ చర్యా తీసుకోలేదట వారు.

పేరా సైకాలజీ యూనిట్ సాధించిన పరిశోధనలమీద ఒక నివేదిక సమర్పించమని రాజస్థాన్ విశ్వవిద్యాలయం ఒక కమిటీని వేస్తే ఆ కమిటీ మరికొన్ని విషయాలు బయట పెట్టింది. బెనర్జీ మరొక ప్రొఫెసరు పేర వ్యాసాలు కొన్ని పత్రికలుకు రాశారనీ, దానికి ఆ ప్రొఫెసర్ అభ్యంతరం తెలియజేశారనీ యీ కమిటీ చెప్పింది అంతేగాక బెనర్జీ పరిశోధనలు శాస్త్రపరీక్షలకు నిలవలేకపోతున్నాయనీ కూడా ఆ కమిటీ అభిప్రాయపడింది.

యు. జి. సి. (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) కోరినమేరకు బెనర్జీ ఏ పరిశోధననూ జరుపలేదని, జరిగిన వాటిలో విజయం సాధించనూ లేదనీ, పేరా సైకాలజీ, మంచాల వాడకంమీద రోగి మానసిక ప్రభావం, పాము కాటు—మందు, అధిక జ్ఞాపకశక్తి వంటి అంశాలమీద ఆయన పరిశోధనలు అంలగా పరిపక్వ దశకు రాలేదట

ఆయనకు డాక్టరేట్ యిచ్చిన నియోపెటియన్ (అమెరికా) కాలేజీ అధికారులు తామిచ్చిన పట్టా కేవలం పట్టాగానే చలామణి అవుతుందనీ, దానికి విద్యాసంస్థల స్థాయిలో గుర్తింపు లేదని, ఆ పట్టా వ్యక్తి మేధావి, పండితుడు లని అనుకోనవసరం లేదని తెలియజేసింది

1965 డిశంబరు 22వ తేదీన ఒక ఢిల్లీ దినపత్రికలో బెనర్జీ ఒక స్త్రీని హిప్నటైజు (కనికట్టు) చేస్తున్నట్టు ప్రచురించిన ఫోటో వచ్చి మోసమని— దర్షన్‌కి చెందిన ప్రొఫెసర్ మిత్‌రాయిల్ అన్నారట. ఆయన ప్రేక్ మేరీనె అనే ఆమెను హిప్నటైజు చేస్తున్న ఫోటోను తీసుకుని తన స్థానంలో బెనర్జీ బొమ్మను అతికించినట్టు ఆయన ఆరోపించారు.

విశ్వవిద్యాలయం యీ శాఖకి ఒకటిన్నర లక్ష యిచ్చి, పైగా నిధి సేకరణకు బెనర్జీకి అధికారం యిచ్చిందట. ఆయనెంత పోగు చేశారో, ఎంత చేరవేశారో నిర్ణయం కాలేదు. ఇప్పుడిక ఈశాఖ నిరుపయోగమనీ, గొప్ప సైకాలజిస్టు దొరికేవరకూ యీ శాఖని మూతవేసి వుంచడం మంచిదని తీర్మానించినా, ప్రొఫెసర్ బెనర్జీ తొణుకు, బెణుకు లేకుండా "ఈ విశ్వవిద్యాలయంలో నా శాఖ, నేనూ సుస్థిరం" అన్నారట.

భారతప్రభుత్వాన్ని, అమెరికా ప్రభుత్వాన్ని ఉభయదేశాల ప్రజలను, విద్యాధికులను పల్టీలు కొట్టించి అవిఘ్నంగా తన కార్యాన్ని నిర్వర్తించిన బెనర్జీని ఎలా పొగడాలి!

లెట్ అది ఇషు కన్!